క్లుప్తంగా

ఉచిత ఇసుక కోసం బారులు తీరిన వాహనాలు



తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ అవసరాలకు వాగుల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకు వెళ్లవచ్చని ప్రకటించడంతో తిరువూరు మండలంలోని పలు వాగుల్లో మంగళవారం ఇసుక తవ్వకాలకు ట్రాక్టర్లు బారులు తీరాయి. గానుగపాడు, చింతలపాడు, రోలుపడి, కట్టిలేరు వాగుల నుంచి ఇసుక తవ్వకాలకు వచ్చిన కూలీలతో పాటు ఇసుక తీసుకువెళ్లేందుకు వచ్చిన ట్రాక్టర్లతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఇసుక తరలింపునకు ఎటువంటి మార్గదర్శకాలు లేవని, ప్రజలు తమ సొంత అవసరాలకు మాత్రమే తీసుకు వెళ్లాలని, ఎటువంటి విక్రయాలు జరుపకూడదని ప్రభుత్వం ఆదేశించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, తహసీల్దార్ లక్ష్మి తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

తిరువూరు: పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి డ్రెయినేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడటంతో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. ఫ్యాక్టరీ సెంటర్‌లోని డ్రెయినేజీలో క్యారీ బ్యాగ్‌లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించిన 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ సచివాలయ శానిటరీ సిబ్బంది సహకారంతో వాటిని తొలగించారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

నరసాపురం(విస్సన్నపేట): కేఆర్‌డీఎల్–గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.40 వేల విలువ చేసే మైక్ సెట్‌ను నరసాపురం జెడ్పీ హైస్కూల్‌కు మంగళవారం అందజేశారు. సంస్థ ప్రతినిధి కనకపూడి ఇశ్రాయేలు, పాఠశాల హెచ్‌ఎం ఎస్. శోభాలత, గ్రామ పెద్దలు జి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 11 మందికి ఉద్యోగాలు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): బెంగళూరుకు చెందిన ప్రముఖ రైస్‌ఎక్స్ టెక్నాలజీస్ సంస్థ స్థానిక ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ సెలక్షన్స్ మంగళవారం నిర్వహించింది. ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు 200 మంది రిక్రూట్‌మెంట్‌లో పాల్గొన్నారు. సంస్థ హెచ్ఆర్ మేనేజర్లు మూడు రౌండ్లలో జరిపిన ఇంటర్వ్యూలో ఉత్తమ ప్రతిభ చూపిన 11 మందిని ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపాల్ కాంద్రగుంట రామకృష్ణయ్య తెలిపారు.

దివ్యాంగులకు ఫిజియో థెరపీ

ముసునూరు: సమగ్ర శిక్షాభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో థెరపీ నిర్వహించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం
మైలవరం సీఐ చంద్రశేఖర్

మైలవరం: సైబర్ నేరాలపై బ్యాంక్ మేనేజర్లు అప్రమత్తంగా ఉండాలని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. మైలవరం పోలీస్‌స్టేషన్‌లో మైలవరం సర్కిల్ పరిధిలోని వివిధ బ్యాంక్‌ల మేనేజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎక్కువ మొత్తంలో సొమ్ము చెల్లింపులో తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరిగాయని, బ్యాంక్‌ల్లో వినియోగదారుల లావాదేవీలు నిర్వహించే సందర్భంలో కూలంకషంగా సమాచారం సేకరించి, తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.

థర్మల్ విద్యుత్‌కేంద్రం సందర్శన

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ ట్రిపుల్‌ఈ తృతీయ సంవత్సరం విద్యార్థులు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని విద్యుత్ థర్మల్ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. థర్మల్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ పంపిణీ వ్యవస్థలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోనే ఉన్న కిన్నెరసాని ప్రాజెక్టును విద్యార్థులు సందర్శించారు. హెచ్ఓడీ శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బూడిదలోడు లారీలతో
రోడ్డు గుల్ల

- గుంతలమయంగా ఖిల్లా రోడ్డు
- నరకప్రాయంగా మారుతున్న ప్రయాణం
- ఈ రోడ్డులోనే విద్యా సంస్థలు, కాలనీలు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి ఖిల్లా రోడ్డుపై ఏడాది పొడవునా బూడిద లోడింగ్ లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. లారీల వేగానికి రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. లారీల నుంచి పడుతున్న బూడిద వాయుకాలుష్యం రూపంలో ప్రజలను అనారోగ్యానికి గురిచేస్తోంది. ఈ రోడ్డులోనే కొండపల్లి ఖిల్లా పర్యాటకులు, నిమ్రా, నోవా కళాశాలల విద్యార్థులు, ఇందిరమ్మ కాలనీ, వసంత కాలనీ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణానికి వీరు పడరాని పాట్లు పడుతున్నారు.

దూరదర్శన్ కేంద్రం కోసం రోడ్డు నిర్మాణం

గతంలో కొండపల్లి ఖిల్లాకు బొమ్మల కాలనీ మీదుగా కొండమీద నుంచి నడక మార్గంలో సందర్శకులు కొండపల్లి ఖిల్లాకు చేరాల్సి వచ్చేది. హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం నుంచి కోస్తాంధ్ర ప్రాంతంలో టీవీ ప్రసారాల కోసం 1988 ప్రాంతంలో విజయవాడ దూరదర్శన్ రిలే టవర్‌ను ఖిల్లా సమీపంలో ఎత్తైన కొండలపై ఏర్పాటు చేశారు. అక్కడికి రాకపోకల కోసం 65వ నంబర్ జాతీయ రహదారి నుంచి 8 కిలో మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ శాఖ ఘాట్ రోడ్డు ఏర్పాటు చేసింది. ఆ సమయంలోనే ఎన్టీటీపీఎస్ బూడిద నీటి వ్యర్థాల చెరువు, అనతికాలంలోనే వివిధ కళాశాలలు, ప్రజల నివాస కాలనీలు ఈ రోడ్డు సమీపంలో ఏర్పాటయ్యాయి. ఈ రోడ్డు మార్గం ద్వారానే ఆయా వర్గాల వారు రాకపోకలు సాగిస్తున్నారు.

వందలాది బూడిద లారీల రాకపోకలు..

అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరగడంతో ఇళ్ల బేస్‌మెంట్‌కు బూడిదను ఉపయోగించడం ప్రారంభించారు. దీంతో బూడిదకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. రోజుకు సుమారు 500 లారీలకు పైగానే రవాణా జరుగుతోంది. లారీల రాకపోకల సమయంలో బూడిదలోని నీరు రోడ్డుపై కారిపోవడంతో గుంతలు ఏర్పడి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వేసవిలో రోడ్డుపై దుప్పటిలా పరుచుకున్న బూడిద కాలుష్యం, లారీల శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

రహదారి అభివృద్ధిపై గతంలో ఆందోళన

బూడిద రవాణా లారీలతో రోడ్డు గుల్లబారడంతో పాటు వాయు కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. దీనిపై గతంలో స్థానికులు పలుమార్లు ఆందోళనకు దిగారు. లారీల ద్వారా వ్యాపించే బూడిద గాలి పీల్చడం వలన శ్వాసకోశ వ్యాధులకు గురువుతున్నామని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కాలుష్యం నివారణకు చర్యలు తీసుకుంటామని, రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు కానీ అమలుకు నోచుకోవడం లేదు.

ఖిల్లా సందర్శకులకు సర్కస్ ఫీట్లు తప్పదు

ఈనెల 23వ తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుంది. ఆటోలు, బైక్‌లు, కార్లు, ఇతర వాహనాల ద్వారా సందర్శకులు ఖిల్లాకు చేరతారు. గుంతలు పడిన రోడ్డుపై సందర్శకులకు సర్కస్ ఫీట్లు తప్పవని స్థానికులు చెబుతున్నారు. అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. కాలనీ వాసులు వివిధ రకాల రోజువారీ పనులకు వెళ్లే సమయం, విద్యార్థులు కాలేజీలకు చేరి, తిరిగి వెళ్లే సమయాల్లో బూడిద లారీల రాకపోకలను నియంత్రించాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు.



గుంతలతో ప్రమాదకరంగా మారిన ఖిల్లా రోడ్డు
(ఇన్‌సెట్) ఖిల్లా రోడ్డులో బూడిద లోడుతో వెళుతున్న లారీలు

వాయు కాలుష్యంతో వ్యాధులు



ఖిల్లా రోడ్డులో ప్రయాణించే బూడిద రవాణా లారీలతో కాలనీలో ఉండలేక పోతున్నాం. రాత్రీ, పగలు తేడా లేకుండా రోడ్డుపై లారీలు తిరగడంతో శబ్ద, వాయు కాలుష్యంతో ఇళ్లల్లో ఉండలేక ఇబ్బందులు పడుతున్నాం. అనేక మంది శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు.

– వేముల కోటేశ్వరమ్మ, ఇందిరమ్మ కాలనీ

అధికారులు స్పందించాలి



కొండపల్లి ఖిల్లాకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. బూడిద రవాణా లారీలతో ఈ దుస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో ఇళ్లకు చేరాలంటే ఓవైపు లారీల తాకిడి, మరో వైపు గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు అభివృద్ధి చేస్తామని అధికారులు చెప్పినా కార్యరూపం దాల్చడంలేదు.

– చెదల నాగరాజు, వసంత కాలనీ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మరమ్మతుల నిమిత్తం మైలవరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రమేష్ తెలిపారు. అయ్యప్పనగర్, సిద్దిపేట, బస్టాండ్ ఏరియా, రామకృష్ణ కాలనీ, బందర్‌గర్, ఎస్వీఎస్ నగర్, భవానీ నగర్, శివాజీ వీధి, పొందుగల రోడ్డు, విజయవాడ రోడ్డు, నూజివీడు రోడ్డు, పోస్టాఫీస్ రోడ్డు, శివాలయం వీధి, ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, రైతుబజార్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

25న జాబ్‌మేళా

నూజివీడు: నూజివీడులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తామని ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి వాడపల్లి కిశోర్ మంగళవారం తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు కలిగి, 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన యువత పాల్గొనవచ్చన్నారు. జాబ్‌మేళాలో నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, వరుణ్ మోటార్స్, మెడ్‌ప్లస్ ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, 130 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని చెప్పారు. ఆసక్తిగల వారు తమ బయోడేటా, సర్టిఫికెట్ల నకలుతో హాజరు కావాలన్నారు.

నేడు రెవెన్యూ గ్రామ సభ

చాట్రాయి: మండలంలోని కొత్తగూడెంలో రెవెన్యూ గ్రామ సభ బుధవారం నిర్వహిస్తామని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై గ్రామ సభలో అర్జీలు అందజేయవచ్చని చెప్పారు.

26న మండల పరిషత్ సమావేశం

ఆగిరిపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 26న జరుగుతుందని ఎంపీడీఓ భార్గవి తెలిపారు. ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

పరిహారం కోసం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

ఇబ్రహీంపట్నం: తహసీల్దార్ కార్యాలయాన్ని పలు గ్రామాల వరద బాధితులు మంగళవారం ముట్టడించారు. కొండపల్లి, మండల పరిధి గ్రామాల్లో వందలాది మందికి పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వ అధికారులు అన్యాయం చేశారని బాధితులు ఆరోపించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ, సీఐటీయూ, ఎంసీపీఐయూ నేతలు బాధితులకు సంఘీభావంగా నిలిచారు. వైఎస్సార్ సీపీ వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్, సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతోనే అనేకమంది వరద బాధితులకు నష్ట పరిహారం పంపిణీలో అన్యాయం జరిగిందని విమర్శించారు. మరోసారి అర్జీలు స్వీకరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, కలకంటి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేస్తున్న వరదముంపు బాధితులు

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

రీ సర్వే డీటీ గీత

చాట్రాయి: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, వీటిని వినియోగించుకోవాలని రీ సర్వే డీటీ గీత అన్నారు. బూరుగుగూడెంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ రైతులు భూ సమస్యలు ఉంటే ఈ సభల్లో తగిన ఆధారాలతో అర్జీలు అందజేయాలన్నారు. గ్రామ సభకు 33 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఎంపీపీ నిర్మల, నాయకులు పాల్గొన్నారు.

- **అంజనేయపురం(తిరువూరు):** మండలంలోని అంజనేయపురంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. గతంలో గ్రామంలో జరిగిన భూముల రీ సర్వేలో రైతులకున్న సమస్యలను రెవెన్యూ అధికారులు ఈ సభలో పరిశీలించారు. సరిహద్దుల్లో మార్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులుండటం వంటి సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరారు. సర్పంచి మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ కోటేశ్వరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్, మండల సర్వేయర్ గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి తేనె నరేంద్ర, వీఆర్వో శంతన్ పాల్గొన్నారు.
- **విస్సన్నపేట:** కొర్లమండ గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తామని తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి మంగళవారం తెలిపారు. రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలపై రైతులు వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు, ఇతర ఆధార పత్రాలతో గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.
- **తిరువూరు:** ఆంజనేయపురం, ముష్టికుంట్ల గ్రామాల్లోని సచివాలయాల్లో బుధవారం ఆధార్ ప్రత్యేక శిబిరాలు జరుగుతాయని తిరువూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. తిరువూరు పట్టణంలోని రాజుపేట ఒకటో సచివాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ శిబిరం జరుగుతుందని నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు చెప్పారు.



బూరుగుగూడెం సభలో మాట్లాడుతున్న రీసర్వే డీటీ గీత

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

తహసీల్దార్ సుబ్బారావు

నూజివీడు: దీపావళి పర్వదినం సందర్భంగా పట్టణంలో తాత్కాలికంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా లైసెన్స్‌ను తీసుకొని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ బి.సుబ్బారావు పేర్కొన్నారు. బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే లారీ అసోసియేషన్ హాల్ స్థలాన్ని మంగళవారం తహసీల్దార్‌తో పాటు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బాణసంచా లైసెన్సుదారులు నిర్ణయించిన బహిరంగ ప్రదేశాలలోనే ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. టపాసుల విక్రయ దుకాణాల వద్ద నీరు, ఇసుక, తదితర అగ్ని ప్రమాదాల నిరోధక సామగ్రిని తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జనావాసాలకు, విద్యా సంస్థలకు, హాస్పిటల్స్‌కు, పెట్రోలు బంకులకు, గ్యాస్ సిలిండర్ గోడౌన్లకు దూరంగా బాణసంచా విక్రయాలు నిర్వహించాలని చెప్పారు. దీపావళి రోజున అవాంఛనీయ ఘటనలు జరిగినా, సహాయం అవసరమైనా, అత్యవసర సమయంలో ఫైర్‌స్టేషన్‌కు 101, డయల్ 112కు ఫోన్ చేసి తెలియజేయాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో తాత్కాలిక లైసెన్స్‌దారులు పాల్గొన్నారు.



బాణసంచా దుకాణాల ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు, తదితరులు

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

మైలవరం: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న కేసరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా స్థాయి (మెన్, ఉమెన్) పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు డి. రామ్‌కుమార్ 375 కిలోలు బరువు ఎత్తి బంగారు, సిల్వర్ పతకాలు, కేకే సిద్ధార్థ 370 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం, టి. గోపీచంద్ 350 కిలోల బరువు ఎత్తి సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎన్‌వీ రాజ్‌కుమార్, జిమ్ కోచ్ ఎస్. నటరాజు, కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

ఎన్‌సీసీతో క్రమశిక్షణ పెంపు

మైలవరం: విద్యార్థుల్లో దేహదారుఢ్యం, క్రమశిక్షణ పెంపునకు ఎన్‌సీసీ దోహదం చేస్తుందని 17 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నూతనంగా ఎన్‌సీసీని ప్రారంభించారు. మంగళవారం ఎన్‌సీసీ రైజింగ్ డే సందర్భంగా విద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. 1600 మీటర్ల రన్నింగ్, పుష్‌అప్స్, రిటెన్ టెస్ట్‌లు నిర్వహించి 84 మంది విద్యార్థులు, 13 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

మైలవరం: రెడ్డిగూడెంలో వరద బాధితులు బుడగ జంగాలకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ జక్కం వెంకటేశ్వరరావు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కె. వెంకటేశ్వరరావు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు వ్యాపార ప్రముఖుడు నాగుబండి శ్యాంసుందర్‌రావు రూ.10 వేలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శంకరరావుకు మంగళవారం అందజేశారు. పాఠశాలలో బెంచీల ఏర్పాటుకు ఈ మొత్తాన్ని ఉపయోగించాలని ఆయన కోరారు.

వాగులో పడి వ్యక్తి మృతి

మైలవరం: చేపల వేటకు వెళ్లి వ్యక్తి వాగులో పడి మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం.. మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన బొంక రాజ (55) వెల్వడం బుడమేరు వాగులోకి చేపల వేటకు సోమవారం వెళ్లాడు. మంగళవారం వరకు అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చేపల వేటకు వెళ్లిన కొంత మంది వ్యక్తులు బొంక రాజు కాల్వలో పడి మృతిచెందినట్లు పోలీసులకు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాగులో వెతికి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విస్సన్నపేటలో రక్తదాన శిబిరం

విస్సన్నపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో వికాస్ విద్యా సంస్థల సహకారంతో స్థానిక వికాస్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 64 యూనిట్ల బ్లడ్ సేకరించామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీర్ల కిరణ్ తెలిపారు.

పంట పొలాల్లో ఎలుకల ఉధృతిని అరికట్టండి

వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ శారద

చంద్రగూడెం(మైలవరం): పంట పొలాల్లో ఎలుకల ఉధృతిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఎ. శారద అన్నారు. చంద్రగూడెంలోని రైతు సేవా కేంద్రంలో బ్రోమోడయోలోన్ ఎలుకల మందును ఉపయోగించి సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శారద మాట్లాడుతూ నారుమడి, పిలక దశ, పండిన పంటలో కంకులను ఎలుకలు నాశనం చేస్తాయన్నారు. ఎలుకలను సామూహికంగా నివారించినప్పుడు మాత్రమే వాటి వలన కలిగే నష్టాన్ని అరికట్టవచ్చని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి ఎస్. నాగమణెమ్మ మాట్లాడుతూ మందు తయారీ విధానాన్ని వివరించారు. మందు తయారు చేసి రైతులకు చూపించారు. ప్రతి ఎలుక కన్నం వద్ద 10 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి పెట్టాలన్నారు. ఎలుకల బొరియల్లో పొట్లం పెట్టి ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి ఏఎన్‌బీ అనితా భాను, ఏఓ టెక్నికల్ వి. ఊర్మిళ, మండల వ్యవసాయాధికారి కె.సంధ్యారాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు. మండలంలోని వెల్వడం, పొందుగల తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో రైతు భరోసా కేంద్రాల వ్యవసాయాధికారులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.

- **ఇబ్రహీంపట్నం:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలాల్లో సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వరి పొలాల్లోని ఎలుకల బొరియల వద్ద 15 రోజుల వ్యవధిలో చేపట్టాల్సిన విధి విధానాలను రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ శారద, అసిస్టెంట్ డైరెక్టర్ అనితభాను, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.
- **గానుగపాడు(తిరువూరు):** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం గానుగపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర ఉప సంచాలకురాలు మాధవీలత ఎలుకల నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. ఎలుకల నిర్మూలనా విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడీ, వ్యవసాయాధికారి పద్మ, రైతులు పాల్గొన్నారు.



చంద్రగూడెంలోని వరి పొలాన్ని సందర్శించి రైతులకు సూచనలిస్తున్న శారద తదితరులు

సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించాలి

చాట్రాయి: రైతులు తాము సాగు చేస్తున్న పంటలో సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. కోటపాడు, చీపురుగూడెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక కాంప్లెక్స్ ఎరువులను తగ్గించి, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని, భూమిలో సూక్ష్మ జీవుల వృద్ధి రేటు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

- **నూజివీడు:** తక్కువ పెట్టుబడితో పంటల సాగును చేపట్టి అధిక దిగుబడులు సాధించేలా రైతులను తీర్చిదిద్దడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నూజివీడు ఏడీఏ జి.విద్యాసాగర్ అన్నారు. తుక్కులూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రైతులకు పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ పద్ధతులు, ప్రస్తుత దశలో వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వరి పొలాలను సందర్శించి రైతుల సందేహాలను నివృత్తిచేశారు. వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి, ఉద్యాన అధికారి ఆర్. హేమ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి చేయాలి
దళిత ఉద్యమనేత డీబీ లోక్



ఇబ్రహీంపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రిజర్వేషన్ ఫలాలతో ఉద్యోగాలు పొందిన వారు ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషిచేయాలని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సాధన కమిటీ అధ్యక్షుడు, దళిత ఉద్యమనేత డీబీ లోక్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను మంగళవారం ఆయన కలిశారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవీ కిరణ్, బ్రాంచి అధ్యక్షుడు ఉమావిజయ్‌చంద్, కార్యదర్శి సాల్మన్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నూజివీడు: ప్రత్యేక ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ కోరారు. పాతరావిచర్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని మంగళవారం ఎంపీడీఓ పరిశీలించారు. పాతరావిచర్ల ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఆధార్ శిబిరాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఆధార్ కార్డుల్లో సవరణలు, చిరునామా మార్పులు, బాల ఆధార్ కోసం నమోదు చేసుకోవడం, బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవలను అందిస్తామన్నారు. ఈ నెల 25 వరకు శిబిరం జరుగుతుందని చెప్పారు.

నేడు పలు గ్రామాలలో..

విస్సన్నపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో ఆధార్ నమోదు కార్యక్రమం మంగళవారం విస్సన్నపేట గ్రామ ప్రజలకు నిర్వహించారు. బుధవారం చంద్రుపట్ల, లంబాడీతండా, తెల్లదేవరపల్లి, పుట్రేల గ్రామాల ప్రజలకు ఆధార్ శిబిరం జరుగుతుందని ఎంపీడీఓ సీహెచ్ చిన్నరాట్నాలు తెలిపారు.